మన సమగ్ర
# ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
శుక్రవారం 11, సెప్టెంబర్, 2026
తెలుగు డైలీ
ప్రజావాణి ఎప్పటి వార్తలు అప్పుడే...
5 PM
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY
https://epaper.prajavaani.net

### రేవంత్ రెడ్డిని
## కలిస్తే తప్పేంటి

**మంత్రి పదవులపై అధిష్ఠానమే నిర్ణయం తీసుకుంటుందని స్పష్టీకరణ**
**కొండా సురేఖ విషయంలో సీఎం నిర్ణయంలో తప్పులేదని వ్యాఖ్య**



హైదరాబాద్ :ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తన భేటీపై సాగుతున్న ప్రచారానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెరదించారు. ముఖ్యమంత్రి, తాను ఎప్పుడూ కలహించుకోవాలని కొందరు కోంకుంటున్నారని ఆయన ఆరోపించారు. నియోజకవర్గ అభివృద్ధికి, నిధుల మంజూరు కోసం ముఖ్యమంత్రిని, ఉప ముఖ్యమంత్రిని కలవడంలో తప్పేముందని ఆయన ప్రశ్నించారు. అభివృద్ధి పనుల నిమిత్తం వారిని కలవడం అనివార్యమని, దీనికి రాజకీయ అర్థాలు ఆపాదించవద్దని కోరారు. ముఖ్యమంత్రితో తనకు అభిప్రాయ భేదాలు ఉన్న మాట వాస్తవమేనని, అయితే అవి సహజమైనవని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. మంత్రి పదవి కోసం తాను ముఖ్యమంత్రికి లొంగిపోయినట్లు కొందరు, ఇద్దరి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయని మరికొందరు చేస్తున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. "ముఖ్యమంత్రిని కలిస్తే లొంగిపోయినట్లు, కలవకపోతే దూరం పెరిగినట్లు రకరకాలుగా ప్రచారం చేస్తున్నారు. నేను, సీఎం ఘర్షణ పడాలని కొందరు ఆశిస్తున్నారు" అని ఆయన వ్యాఖ్యానించారు. మంత్రి పదవుల విస్తరణ అంశం పూర్తిగా పార్టీ అధిష్ఠానం పరిధిలోనిదని, గతంలో తనకు మంత్రి పదవి ఇస్తామని హామీ లభించినట్లు రాజగోపాల్ రెడ్డి గుర్తు చేశారు. అధిష్ఠానం తీసుకునే ఏ నిర్ణయానికైనా తాను కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు.

## ఢిల్లీ చేరుకున్న పుతిన్

**నేడు ప్రధాని మోదీతో భేటీ.. ద్వైపాక్షిక చర్చలు**



**న్యూఢిల్లీ :** శనివారం నుంచి ప్రారంభం కానున్న బ్రిక్స్ సదస్సు కోసం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఢిల్లీ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం లభించింది. కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి కేవీ సింగ్, ఇతర ఉన్నతాధికారులు పుతిన్‌కు స్వాగతం పలికారు. పుతిన్ తన పర్యటన సందర్భంగా ప్రధాని మోదీతో శుక్రవారం భేటీ కానున్నారు. రష్యా-ఇండియా మధ్య ద్వైపాక్షిక సంబంధాల పెంపునకు, సహకారానికి, రక్షణ, ఎనర్జీ, టెక్నాలజీ, ఫార్మా, వ్యాపారం, వాణిజ్యం వంటి రంగాలపై చర్చలు జరుపుతారు. మోదీ, పుతిన్ చర్చల అనంతరం కీలక ఒప్పందాలపై సంతకాలు చేస్తారు. ప్రధానంగా ఇరు దేశాల మధ్య చెల్లింపులకు సంబంధించిన మెకానిజం, సమస్యల పరిష్కారం వంటి అంశాలపై చర్చలు జరుగుతాయి. శనివారం నుంచి అధికారికంగా బ్రిక్స్ సదస్సు ప్రారంభమవుతుంది. ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత పుతిన్ బ్రిక్స్ సదస్సు కోసం వేరే దేశం రావడం ఇదే మొదటిసారి. ఈ సదస్సుకు చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామాఫోసా, ఇండోనేసియా అధ్యక్షుడు ప్రాబోవో సుబియాంటో, ఈజిప్టియన్ అధ్యక్షుడు అబ్దెల్ ఫత్తాహ్ ఎల్ సిసి,అలి, వియత్నం ప్రధాని లె మిన్స్ హుంగ్ వంటి నేతలు హాజరుకానున్నారు.

### సంక్షేమ క్యాలెండర్
## రూపొందించండి



అమరావతి, సెప్టెంబర్ 11: వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జిల్లా కలెక్టర్ల రెండో రోజు సమావేశం శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల అమలుపై సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. సంక్షేమ క్యాలెండర్ రూపొందించాలని జిల్లా కలెక్టర్లను ఆయన ఆదేశించారు. ఏయే సంక్షేమ పథకాలు.. ఏయే తేదీల్లో ఇస్తున్నామనే అంశాన్ని తేదీలతో సహా వెల్లడించాలని సూచించారు. సంక్షేమం కింద అందిస్తున్న నగదు సద్వినియోగం చేసుకునే అంశంపై.. లబ్దిదారుల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని వారికి స్పష్టం చేశారు. కులవృత్తులకు సంబంధించి వాల్యూ అడిషన్ చేసేలా.. కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. చేనేత, చేతి వృత్తుల కేంద్రాలను ఎక్స్‌పీరియన్స్ సెంటర్లుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు సంక్షేమ పండగలు చేద్దామని వారికి వివరించారు. కాపు కార్పొరేషన్ లోన్‌ల విషయంలో.. ఎక్కడైనా నిధులు ఉండిపోతే వాటిని వెంటనే వాడాలని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. నిధులు లేకపోతే తన దృష్టికి తీసుకు రండి..వెంటనే మంజూరు చేస్తానని అన్నారు. ఫ్యామిలీ మ్యాపింగ్ పేరుతో ఇష్టానుసారం పెన్షన్లు, ఇళ్లు కేటాయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరెక్ట్ కాదు..కంబైన్డ్ ఫ్యామిలీ అని చెప్పారు.

## ఫాంహౌస్‌లో కేసీఆర్ కుట్ర..

**మహిళా అధికారుల ముందు అభ్యంతరకరంగా వ్యవహరించారు**

- శాసనసభ సజావుగా జరగకుండా కేసీఆర్ ఫాంహౌస్‌లోనే కుట్రలు జరిగాయన్న రేవంత్ రెడ్డి
- ప్రజాప్రతినిధులను, పోలీసులను దూషిస్తూ మూడు రోజులు సభను అడ్డుకున్నారని మండిపాటు
- బీఆర్ఎస్ కుట్రలను కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సమర్థవంతంగా తిప్పికొట్టారని ప్రశంస



హైదరాబాద్, సెప్టెంబర్ 11: శాసనసభను సజావుగా సాగనివ్వకుండా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన ఆయన ఫాంహౌస్‌లోనే కుట్రలు పన్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. అధికారం పోయినా అహంకారం వీడని బీఆర్ఎస్ నాయకులు పోలీసు అధికారులను, ప్రజాప్రతినిధులను దూషిస్తూ మూడు రోజుల పాటు సభాకార్యక్రమాలను అడ్డుకున్నారని మండిపడ్డారు. నిర్వహించిన కాంగ్రెస్ శాసనసభా పక్ష (సీఎల్పీ) సమావేశంలో ఎమ్మెల్యేలను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి సుదీర్ఘ ప్రసంగం చేశారు. సభలో అధికారులపై అనుచితంగా ప్రవర్తించడమే కాకుండా, సభాపతిని అత్యంత తీవ్ర పదజాలంతో దూషించారని, మహిళా అధికారుల ముందే టీషర్టులు విప్పి అభ్యంతరకరంగా నిరసన తెలపడం బీఆర్ఎస్ ఎమ్మెల్యేల దిగజారుడుతనానికి నిదర్శనమని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసన తెలిపిన దళితులు నడిచిన నేలను బీఆర్ఎస్ నేతలు శుద్ధి చేసి దళితులను ఘోరంగా అవమానించారని మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాల ప్రారంభం నుండి జరిగిన ఈ అవాంఛనీయ ఘటనలన్నింటిపై ప్రభుత్వం తరఫున సమగ్ర విచారణకు ఆదేశించామని వెల్లడించారు.

బీఆర్ఎస్ కుట్రలను సమర్థవంతంగా తిప్పికొట్టిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కాంగ్రెస్ పార్టీ ద్వారానే రాజకీయంగా ఎదిగిన సునీత లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి లాంటి నాయకులు ఇప్పుడు అదే పార్టీకి నష్టం చేయాలని చూడటం దారుణమని సీఎం అన్నారు. కాంగ్రెస్ అవకాశం ఇవ్వకపోయి ఉంటే వారు రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగేవారా? అని ప్రశ్నించారు. పోలీస్ సిబ్బందిలో కూడా కేటీఆర్‌కు తన రూపమే కనిపిస్తున్నట్టుందని, అందుకే అధికారులపై అంత ఆక్రోశంతో దాడులకు తెగబడుతున్నారని ఎద్దేవా చేశారు. పాలనాపరంగా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల మైలురాయిని పూర్తి చేసుకున్న సందర్భంగా, చేపట్టిన సమగ్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకే ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు సీఎం వివరించారు.

### భూములు తీసుకుని, రియల్ ఎస్టేట్ చేస్తే
## చర్యలు తప్పవు




హైదరాబాద్, సెప్టెంబర్ 11: అసెంబ్లీలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ హైదరాబాద్‌లో కంపెనీలకు కేటాయిస్తున్న భూముల వినియోగంపై కీలక వ్యాఖ్యలు చేశారు. కొన్ని కంపెనీలకు ఇచ్చిన భూములను రియల్ ఎస్టేట్ కార్యకలాపాలకు ఉపయోగిస్తున్నారనే అంశంపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి పెట్టాలని సూచించారు. కంపెనీలకు భూములు కేటాయించే సమయంలో స్పష్టమైన నిబంధనలు, ఆంక్షలు విధించాలని కోరారు. కేటాయించిన భూములను కంపెనీలు తమ ప్రధాన వ్యాపార కార్యకలాపాలకే వినియోగించేలా పర్యవేక్షణ ఉండాలని పేర్కొన్నారు. మరోవైపు టెక్ మహీంద్రా వంటి దిగ్గజ సాఫ్ట్‌వేర్ కంపెనీలు హైదరాబాద్‌కు వస్తున్నప్పటికీ.. నగరంపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని దానం నాగేందర్ అన్నారు. ఇలాంటి కంపెనీలు హైదరాబాద్‌కు వచ్చి కేవలం కాఫీ తాగి వెళ్లిపోయే పరిస్థితి ఉండకూడదని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్న కంపెనీలను ప్రభుత్వం ప్రోత్సహించాలని, వాటికి అవసరమైన సహకారం అందించాలని కోరారు. కంపెనీలను ప్రోత్సహించినప్పుడే రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు రావడంతో పాటు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ అంశాలపై ఐటీ శాఖ మంత్రి ప్రత్యేక దృష్టి సారించాలని దానం నాగేందర్ కోరారు.

## తమ్ముడు.. లెట్స్ డూ కుమ్ముడు'

**అన్నట్లుగా రేవంత్, పొంగులేటి వ్యవహారం**



హైదరాబాద్, సెప్టెంబర్ 11: 'తమ్ముడు.. లెట్స్ డూ కుమ్ముడు' అన్నట్లుగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. 'కొండల్, తొండల్, అనకొండల్' అన్నట్లుగా కొండల్‌రెడ్డి, తొండల్‌రెడ్డి రాష్ట్రంపై విరుచుకుపడి దోచేస్తున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సెక్షన్ 22ఏ భూ బాధితులతో కేటీఆర్, హరీశ్‌రావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలది అంతులేని దోపిడీ అని, అన్నదమ్ములది దారుణమైన భూబాగోతమని ఆరోపించారు. తెలంగాణ రాకముందు రాష్ట్రంలో రియల్ ఎస్టేట్, భూముల పరిస్థితిపై అనేక అనుమానాలు ఉండేవని కేటీఆర్ గుర్తుచేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ పాలనలో ఆరు నెలల్లోనే కరెంటు, మంచి నీటి సమస్యలు పరిష్కారమయ్యాయని అన్నారు. రియల్ ఎస్టేట్‌కు ఊతమిచ్చేలా కేసీఆర్ ఒకే రోజు పలు జీవోలు ఇచ్చారని తెలిపారు. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు, బాసర నుంచి భద్రాచలం వరకు వ్యవసాయానికి పుష్కలంగా సాగునీరు అందించారని కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో రూ.5 లక్షలుగా ఉన్న ఎకరం భూమి విలువ రూ.50 లక్షలకు పెరిగిందన్నారు. దీంతో భూమిని నమ్ముకుంటే నష్టం జరగదనే నమ్మకం ప్రజల్లో ఏర్పడిందని, ఆ నమ్మకంతోనే ప్రజలు కొంత భూమిని కొనుగోలు చేసేవారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 'ల్యాండ్ చోరీ' నడుస్తోందని కేటీఆర్ ఆరోపించారు. భూమి కనిపిస్తే బుక్క పెట్టు.. జాగా కనిపిస్తే పాగా వేయ్ అన్నట్లుగా పరిస్థితి తయారైందన్నారు. గాంధీల సామంతుల పాలనలో గజానికో గజదొంగ, గుంటకో గుంటనక్క ఉన్నారని విమర్శించారు. రాష్ట్రంలో బయటకు కనిపించేది ఒక రెవెన్యూ వ్యవస్థ అయితే.. చీకట్లో మరో సమాంతర రెవెన్యూ వ్యవస్థ నడుస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఫైళ్లు ఎవరి ఆదేశాలతో కదులుతున్నాయో అర్థం కాని పరిస్థితి ఉందన్నారు. దళితులు, గిరిజనులకు చెందిన అసైన్డ్ భూములు మాయమవుతున్నాయని ఆరోపించారు.

### రీజినల్ రింగ్ రోడ్డుకు బీజేపీ సహకరించాలి..
## కేంద్రం ముందుకు రావాలి



హైదరాబాద్, సెప్టెంబర్ 11: రీజినల్ రింగ్ రోడ్డు రాష్ట్రంలోని భారతీయ జనతా పార్టీ సహకరించాలని.. కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాలని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు కోరారు. రీజినల్ రింగ్ రోడ్డు వస్తే జిల్లాలకు కనెక్టివిటీ పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అప్పుడు ఐటీ కంపెనీలు ముందుకు వచ్చే అవకాశం ఉందన్నారు. శుక్రవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. డేటా సెంటర్ల కోసం రూ.70 వేల కోట్ల పెట్టుబడులు తెచ్చామని వివరించారు. డేటా సెంటర్ల విషయంలో కేంద్రం తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా తమ ప్రభుత్వం ముందుకు వెళుతోందని పేర్కొన్నారు. హైదరాబాద్లో గూగుల్ ఇంకుబేషన్ హబ్ పనులు ప్రారంభమయ్యాయన్నారు. వరంగల్ ఎయిర్ పోర్ట్ అందుబాటులోకి వస్తే అక్కడకు ఎయిర్ పోర్ట్ అందుబాటులోకి వస్తే అక్కడకు కంపెనీలు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. గత ప్రభుత్వంలో కొన్ని జిల్లాల్లో ఐటీ టవర్లను నిర్మించి వదిలేశారని చెప్పారు. అవి చాలా వరకు నిరుపయోగంగా ఉన్నాయన్నా రు. సోషల్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ ఉంటేనే ఐటీ కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయని అన్నారు. స్పెషల్ ఇన్సెంటివ్స్ ఇచ్చి కంపెనీలను రప్పించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. రెండు మూడు రోజుల్లో ఆదిలాబాద్‌లో ఐటీ టవర్ ప్రారంభిస్తామని మంత్రి వివరించారు. పెద్దపల్లిలో యాంకర్ పార్టనర్ కోసం వెతుకుతున్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

# సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న పలాస ఎమ్మెల్యే... శిరీష

- గ్రీవెన్స్‌లో గౌతు శిరీషకు వెల్లువెత్తిన వినతులు
- రోడ్లు.. డ్రైన్లు.. పింఛన్లపై ప్రజల దరఖాస్తులు వచ్చాయి.
- అధికారులతో అక్కడికక్కడే మాట్లాడిన ఎమ్మెల్యే





**పలాస ప్రజావాణి ప్రతినిధి**
శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రత్యేక దృష్టి సారించారు. పలాసలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వ్యక్తిగత సమస్యలతో పాటు గ్రామాలు, వార్డులకు సంబంధించిన పలు ప్రజా సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు.రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ సమస్యలు, పింఛన్లు, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై ప్రజలు ఎమ్మెల్యేకు దరఖాస్తులు సమర్పించారు. తమ ప్రాంతాల్లో రహదారులు అధ్వానంగా ఉండటంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, డ్రైన్లు సక్రమంగా లేక మురుగునీరు నిలిచిపోతోందని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అర్హత ఉన్నప్పటికీ పింఛన్లు అందడం లేదని మరికొందరు విన్నవించారు.ప్రజలు అందించిన ప్రతి వినతిని ఎమ్మెల్యే గౌతు శిరీష పరిశీలించారు. సమస్యల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. తక్షణమే పరిష్కరించగల సమస్యలపై అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అంశాలను కూడా నిబంధనల ప్రకారం పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రజలు తమ సమస్యల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా గ్రీవెన్స్ ద్వారా నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల సమస్యలకు ప్రాధాన్యమిస్తూ రోడ్లు, డ్రైన్లు తదితర అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను కేవలం స్వీకరించడమే కాకుండా వాటి పరిష్కారానికి నిరంతరం పర్యవేక్షణ ఉండాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వ యంత్రాంగం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే స్థానిక సమస్యలను వేగంగా పరిష్కరించవచ్చని తెలిపారు. గ్రీవెన్స్ కార్యక్రమానికి వచ్చిన పలువురు తమ సమస్యలను ఎమ్మెల్యే నేరుగా విని సంబంధిత అధికారులతో మాట్లాడటంపై సంతృప్తి వ్యక్తం చేశారు.

# ఆశా కార్యకర్తల చలో అసెంబ్లీ భగ్నంకే ముందస్తు అరెస్టులు

## మద్దూరు ఎస్సై మహమ్మద్ ఆసీఫ్




**మద్దూరు సెప్టెంబర్ 11, ప్రజా వాణి,**
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని శుక్రవారం హైదరాబాద్ లో తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకే ఆశా కార్యకర్తలను ముందస్తుగా అరెస్టు చేసినట్లు మద్దూరు ఎస్సై మహమ్మద్ ఆసీఫ్ తెలిపారు. ఈ సందర్భంగా లద్నూరు గ్రామానికి చెందిన మానేపల్లి ప్రవళిక, ఇమ్మడి పద్మ, మర్మాముల గ్రామానికి చెందిన కొండ మణెమ్మ, ఉప్పల నాగమణి, సాలకాపూర్ గ్రామానికి చెందిన,మరియ, అరెస్టుఅయినవారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కనకయ్య, మహిళ పి సి భార్గవి,ఉన్నారు.

# జేఏసీ ఆధ్వర్యంలో కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన




**అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 10 ప్రజా వాణి**
ఏపీ జెఎసి, మెడికల్ అండ్ హెల్త్, ఆధ్వర్యంలో ఈరోజు 30 రోజుల కార్యచరణలో భాగంగా గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ లో బ్లాక్ మాస్క్ ప్రొటెస్ట్ కార్యక్రమాన్ని స్టాఫ్ నర్స్ మరియు పారామెడికల్ స్టాఫ్ అందరు కలిసి నిర్వహించారు.. ఈ సందర్భంగా ఏపీజిసియన్ డిస్టిక్ ప్రెసిడెంట్ శ్రీదేవి మాట్లాడుతూ, గవర్నమెంట్ మాకు ఇచ్చిన 30 రోజుల గడువులో మాకు గవర్నమెంట్ న్యాయం చేస్తుందని 16 సంవత్సరాల మా కలను నెరవేరేలా ఈ గవర్నమెంట్ చేస్తుందని ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నామని మా నమ్మకాన్ని ఈ గవర్నమెంట్ వోమ్ము చేయదని ఆశిస్తున్నామని చెప్పారు.. ఏపీ జేఏసీ కన్వీనర్ లావణ్య మాట్లాడుతూ, కరోనా వంటి సమయంలో ప్రాణాలకు తెగించి పోరాడేమని చెప్పారు. ఎపిజిసిసి ఎన్ని సభ్యురాలు అనిత మాట్లాడుతూ, ప్రజలకు ఎంతో సేవ చేస్తున్న మాకు న్యాయం జరిగేలాగా గవర్నమెంట్ చూడాలని మాకు న్యాయం చేయాలని మాట్లాడారు ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ శరత్, ఏపీ జి సి ఎన్ ఏ వైస్ ప్రెసిడెంట్ ఎర్రిస్వామి, కెఫా సునీత, మెడికల్ అండ్ స్టాఫ్ నర్స్ పాల్గొన్నారు

# మంచాలో రక్షించిన నెమలికి వెటర్నరీ హాస్పిటల్లో చికిత్స

## కుక్కల దాడి నుంచి నెమలిని కాపాడిన మంచాల స్థానికులు



**ఉమ్మడి రంగారెడ్డి జిల్లా, (ప్రజావాణి) సెప్టెంబర్ 11 మంచాల,**
మంచాల నుండి జపాల పోయే రోడ్డు మార్గంలో అవ యాదయ్య పొలం వద్ద ఈరోజు శుక్రవారం ఉదయం 8 గంటలకు నెమలిని కుక్కలు దాడి చేస్తుండగా. నెమలిని పట్టుకోవడం జరిగింది. పట్టుకొని మంచాల సీఐ మధుసారు కు ఫోన్ చేసి చెప్పగానే ఫారెస్ట్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి సార్ కు నెంబర్ ఇవ్వడం జరిగింది అందులో చంద్రశేఖర్కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వగానే వాచారు జలముని రమేష్ లో పంపించడం జరిగింది. అశ్వాల బాలరాజు ఆవ వెంకటేష్ మల్గా లింగం కలిసి ఫారెస్ట్ ఆఫీసర్లకు అప్పగించడం జరిగింది పభుత్వ పశు వైద్యశాలకు నెమలిని తీసుకురావడం జరిగింది డాక్టర్ కాత్యాయిని పశు వైద్య సిబ్బంది.శ్రీశైలం కలిసి నెమలికి ట్రీట్మెంట్ చేసి ఇంజక్షన్లు ఇవ్వడం జరిగింది. ఫారెస్ట్ ఆఫీసర్ నెమలిని తీసుకు వెళ్లడం ఫారెస్ట్ నర్సరీ ఆగ పెల్లికి తీసుకు వెళ్లడం జరిగింది.

# విద్య, వైద్యం, ఉపాధి కోసం ఉద్యమిస్తాం

## ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దొంతరవేణి మహేష్



**బెజ్జంకి, సెప్టెంబర్ 11 (ప్రజావాణి)**
యాదగిరిగుట్టలో జరిగిన ఏఐవైఎఫ్ తెలంగాణ 3వ రాష్ట్ర మహాసభల్లో సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలానికి చెందిన దొంతరవేణి మహేష్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఎన్నుకున్న సిపిఐ , ఏ ఐ వై ఐఫ్ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపుతూ యువతకు విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ఖాళీ ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ,యువజన హక్కుల సాధన కోసం ఏ ఐ వై ఎఫ్ ఆధ్వర్యంలో నిరంతరం పోరాటాలు కొనసాగిస్తామని మహేష్ స్పష్టం చేశారు.

# చాకలి శ్యామమ్మ కుటుంబానికి సర్పంచ్ ఒగ్గు సాయికిరణ్ ఆర్థిక సహాయం







**మన సమగ్ర ప్రజావాణి ( నేరడి గుంట) సెప్టెంబర్ 11 సంగారెడ్డి జిల్లా ప్రతినిది**
చాకలి శ్యామమ్మ గారు అకాల మరణం చెందడం పట్ల గ్రామ సర్పంచ్ ఒగ్గు సాయికిరణ్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. శ్యామమ్మ గారి కుటుంబాన్ని పరామర్శించి, వారి కుటుంబానికి అండగా నిలిచే ఉద్దేశంతో సర్పంచ్ ఒగ్గు సాయికిరణ్ తరఫున రూ.5,000 ఆర్థిక సహాయాన్ని ఉపసర్పంచ్ కోదండ ఈశ్వర్ చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా శ్యామమ్మ గారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బోయిని శంకర్, ఆశయ, ఒగ్గు దేవరాజు, యువ నాయకులు, అలాగే చాకలి భూమయ్య, చాకలి మొదలయ్య, చాకలి మాసయ్య, చాకలి శంకరయ్య, చాకలి నాగయ్య తదితర గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# 14వ వార్డులో ఎస్ఐఆర్ మార్పులు, చేర్పుల స్వీకరణ



**మన సమగ్ర ప్రజావాణి (జోగిపేట) సెప్టెంబర్ 11 సంగారెడ్డి జిల్లా ప్రతినిధి**
జోగిపేట మున్సిపల్ పరిధిలోని సీపీఎస్ పాఠశాల ప్రాంగణంలో 14వ వార్డుకు సంబంధించిన ఎస్ఐఆర్ () మార్పులు, చేర్పుల ప్రక్రియ కొనసాగుతోంది. 14వ వార్డుకు చెందిన ప్రజల నుంచి సరైన పత్రాలు, అవసరమైన డాక్యుమెంట్లను మున్సిపల్ సిబ్బంది స్వీకరిస్తున్నారు. సరైన డాక్యుమెంట్లు లేని వారికి అవసరమైన పత్రాలను సమకూర్చుకునేలా సూచనలు అందిస్తూ వివరాలను పరిశీలిస్తున్నారు. ఈ ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ తిరుపతి ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది పర్యవేక్షిస్తూ, ప్రజల నుంచి దరఖాస్తులు మరియు సంబంధిత పత్రాలను స్వీకరిస్తున్నారు. 14వ వార్డు ప్రజలు తమ వివరాలను సరిచూసుకుని, అవసరమైన ఆధారాలతో ప్రక్రియను పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు.

# గుగ్గిళ్లలో ఎస్ఐఆర్ నోటీసులపై విచారణ




**బెజ్జంకి, సెప్టెంబర్ 11 (ప్రజావాణి)**
సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం గుగ్గిళ్ల గ్రామంలోని పోలింగ్ స్టేషన్ నంబర్లు 254, 255కు సంబంధించి ఎస్ఐఆర్ నోటీసులపై శుక్రవారం విచారణ నిర్వహించారు. బెజ్జంకి తహసీల్దార్ శ్రీకాంత్ హాజరై నోటీసులు అందుకున్న ఓటర్ల నుంచి వివరాలు,అభ్యంతరాలను స్వీకరించి,ఓటర్ల అర్హతకు సంబంధించిన ఆధారాలను పరిశీలించి, వారి సమస్యలు, అభ్యంతరాలను నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుగ్గిళ్ల మల్లయ్య, ఉప సర్పంచ్ ధుగ్యాని లావణ్య మోహన్, పంచాయతీ కార్యదర్శి వంశీ, జీపీఓ శ్రీనివాస్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com